సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 25 । ఏప్రిల్ । 2024



రక్త పిశాచాలపై దాడి
గిరిజన గ్రామాల్లో మలేరియా తగ్గుముఖం పడుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ చర్యలేనని చెప్పవచ్చు.
- 8లో



మాత, శిశు ఆరోగ్యానికి భరోసా
ఉమ్మడి విజయనగరం జిల్లాలోనే అతిపెద్ద ఆస్పత్రి అయిన ఘోషాస్పత్రిలో మాత, శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.
- 8లో



4 లారీల సీజ్
నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళ్తున్న నాలుగు గని బుగ్గితో రవాణా అవుతున్న లారీలను పట్టుకొని సీజ్ చేసినట్లు ఆర్‌టీఓ ఐశ్వర్య లక్ష్మి బుధవారం తెలిపారు.
- 8లో

న్యూస్‌రీల్

ఐటీడీఏ పీవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన శుభం బన్సల్

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ఎస్‌హెచ్ శుభం బన్సల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కూడా వ్యవహరించనున్నారు. ఇక్కడ పనిచేసిన పీవో కల్పనాకుమారికి బుధవారం బదిలీ అయింది. ఆ స్థానంలో జేసీ ఎస్ఎస్ శోభికకు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించిన వెంటనే శుభం బన్సాల్‌ను పీవోగా నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన శాప్ ఎం.డిగా ఇంతవరకూ పనిచేస్తూ ఇక్కడికి పీఓగా బదిలీపై వచ్చారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జిల్లాలోని ఏపీ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆంగ్లమాధ్యమంలో ప్రవేశించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి మే 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూ గురుకులం. ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున, ఏఅండ్‌టీ గ్రూపులో 20సీట్లు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండి ఏడాదికి లక్షరూపాయలకు మించి ఆదాయం ఉండకూడదని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని సూచించారు.

ముందే వికసించిన మే పుష్పాలు



సూర్యప్రకాశరావు పూతోటలో వికసించిన మే పుష్పాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఐటీడీఏ క్వార్టర్స్‌లో నివసిస్తున్న ఓలేటి సూర్యప్రకాశరావు పూతోటలో ముందస్తుగానే మే పుష్పాలు వికసించాయి. ఏడాదికి ఒక్కసారే ఈ పుష్పం పూస్తుంటుంది. లేత గులాబీ రంగులో అందంగా కనిపించే పుష్పాలు చూపరులకు కనువిందు కలిగిస్తున్నాయి.

ఈదురు గాలుల బీభత్సం



బెలగాం రోడ్లపై కూలిన చెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో ఈదురు గాలులు బుధవారం బీభత్సం సృష్టించాయి. ఈదురు గాలుల వల్ల పలుచోట్ల చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి కరెంట్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తక్షణమే స్పందించిన మున్సిపల్, విద్యుత్ శాఖ సిబ్బంది రోడ్లపై పడిన చెట్లు, కరెంట్ తీగలపై వాలిన కొమ్మలను ఇంజినీరింగ్, శానిటేషన్, ప్లానింగ్ సిబ్బందితో కలిసి తొలగించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

- ఐటీడీఏలో డీఎంహెచ్ఓ సమీక్ష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగన్నాథరావు

సీతంపేట: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని పార్వీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు ఆదేశించారు. ఈ మేరకు స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వైద్యసిబ్బందితో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య పథకాలకు సంబంధించి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గర్భిణి నమోదు జరిగిన నాటి నుంచి ప్రసవమయ్యేంత వరకు క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు చేయాలని చెప్పారు. ఆరోగ్య పరీక్షలను మాతా శిశు సంరక్షణ కార్డులో నమోదు చేయాలని, ప్రసవం తర్వాత శిశు ఆరోగ్య పర్యవేక్షణపై దృష్టిసారించాలన్నారు. బిడ్డ బరువు, టీకాలు, శ్వాస ప్రక్రియపై నవజాత శిశువుల్లో పర్యవేక్షణ చేయాలన్నారు. వేసవి రీత్యా వడదెబ్బ, డీహైడ్రేషనపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ పార్వతి, డీఎంఓ జగన్‌మోహన్‌రావు, ఆర్బీస్‌కే ప్రోగ్రాం అధికారి వినోద్ పాల్గొన్నారు.

జన జాతర



నామినేషన్ కార్యక్రమానికి హాజరైన అశేష జనవాహిని



నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు



నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజారాణి

- కోలాహలంగా నామినేషన్ల దాఖలు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జోగారావు
- అరకు ఎంపీ అభ్యర్థిగా తనూజారాణి
- ఆర్ఓ కార్యాలయాల్లో పత్రాల సమర్పణ

పార్వతీపురంటౌన్:

వేలాదిగా తరలివచ్చిన అశేషజనవాహిని, అభిమానుల కేరింతలు, కోలాహలం నడుమ వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా అలజంగి జోగారావు, అరకు ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గుమ్మ తనూజారాణిల నామినేషన్ పర్వం బుధవారం అట్టహాసంగా సాగింది. ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు పార్వతీపురం పట్టణం, మండలం, సీతానగరం, బలిజిపేట మండలాల నుంచి కనీవినీ ఎరుగని రీతిలో జనం తరలివచ్చారు. దీంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఉదయం ఎనిమిది గంటలకు ఎమ్మెల్యే జోగారావు క్యాంప్ కార్యాలయంలో పాస్టర్ల ప్రార్థన అనంతరం స్థానిక లక్ష్మీ గణపతి ఆలయంలో అలజంగి జోగారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన రాజకీయ గురువు వాకాడ నాగేశ్వరరావు ఆశీర్వాదం తీసుకుని అభిమానులతో కలిసి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి బయల్దేరారు. ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ పూర్తయి బయటకు వచ్చిన తరువాత ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావును వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భుజాలపై ఎక్కించుకుని జయహో నినాదాలు చేశారు.

ఆరుసెట్ల నామినేషన్ దాఖలు

వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా అలజంగి జోగారావు రెండు సెట్లు, ఆయన సోదరుడు అలజంగి రవికుమార్ ఒక సెట్ నామినేషన్లు ఆర్డీఓ కార్యాలయంలో దాఖలు చేశారు. అలాగే అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజా రాణి రెండు సెట్లు, ఆమె భర్త చెట్టి వినయ్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను అరకు పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్‌కు అందజేశారు.

నామినేషన్ కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, దాసరి కార్పొరేషన్ చైర్మన్, రంగుముద్రి రమాదేవి, వైఎస్సార్‌సీపీ మూడు మండలాలు, పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్‌లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే విజయం

పార్వతీపురం చరిత్రలో నిలిచిపోయే మెజార్టీతో తాను విజయం సాధించడం ఖాయమని నామినేషన్ దాఖలు అనంతరం వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు అన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో రాష్ట్రమంతా మళ్లీ ఫ్యాన్ గాలి తుఫాన్‌లా వీయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

'ఫ్యాన్'కు పట్టం కట్టడమే ప్రజల ఆకాంక్ష

రాష్ట్రంలో మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావడమే ప్రజల ఆకాంక్ష అని అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజా రాణి అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఫ్యాన్ గాలే వీస్తోందని ఆమె చెప్పారు.

నేటితో నామినేషన్లకు తెర

- ఇప్పటికే దాఖలు చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లాలో వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఓవైపు సార్వత్రిక ఎన్నికల మంటలు..మరోవైపు భానుడి భగభగలు సెగలు పుట్టిస్తున్నాయి. ఎన్నికల ఘట్టంలో కీలకమైన నామినేషన్ల ప్రక్రియ తుదిదశకు వచ్చింది. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం గురువారం ముగియనుంది. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం..29వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశమిస్తారు. అనంతరం బరిలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను వెల్లడిస్తారు. మే 13న పోలింగ్ జరగనుంది.

వైఎస్సార్‌సీపీలో విజయోత్సాహం..

ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు..స్వతంత్ర అభ్యర్థులూ ఓ దఫా నామినేషన్లను దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థిని గుమ్మ తనూజారాణి పార్వతీపురంలోని కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అలాగే పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ వేశారు.

హోరెత్తుతున్న ప్రచారం

ప్రస్తుతం జిల్లాలో ఎండలు భగ్గుమంటున్నాయి. 42 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడు ఎండల వేడికి..ఎన్నికల వేడి తోడైంది. టికెట్లు ఖరారైన వారు ఇప్పటికే ఓ దఫా అన్ని ప్రాంతాల్లోనూ ప్రచారం పూర్తి చేసేశారు. ఆ తర్వాత నామినేషన్ల హడావిడి కొద్దిరోజులు సాగింది. ఇప్పుడు అది కూడా పూర్తి కావస్తుండడంతో పూర్తిస్థాయిలో ప్రచారం మీద దృష్టి సారిస్తున్నారు. ఇంకా ఎన్నికలకు 20 రోజులే గడువు ఉండడంతో ప్రచారం ఉధృతం చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకుంటున్నారు. పదుల సంఖ్యలో ప్రచార రథాలను, వాహనాలను సమకూర్చుకున్నారు. ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పాలనను వివరిస్తూ, మరోసారి ఆశీర్వదించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రజల వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారి ప్రచారానికి అడుగడుగునా అనూహ్య స్పందన లభిస్తోంది. ఎక్కడికక్కడ ప్రజలు హారతులిచ్చి బ్రహ్మరథం పడుతున్నారు.

టీడీపీకి షాక్



కొయ్యాన శ్రీవాణికి కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి

- వైఎస్సార్‌సీపీలో చేరిన కొయ్యాన శ్రీవాణి
- ఆహ్వానించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన కొయ్యాన శ్రీవాణి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు బుధవారం ఆమె శ్రీకాకుళ జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని అక్కివలస సీఎం బస శిబిరం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీకోసం చురుగ్గా పనిచేయాలని, అందరితో మమేకమై వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేయాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ సందర్భంగా ఆమెకు సూచించారు. ఆమె గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్‌గా పని చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏనుగుల్లో ఎండ భయం

భామిని: మండలంలోని తాలాడ సమీపంలో తిష్ఠ వేసిన ఏనుగుల గుంపు ఎండ తీవ్రతకు విలవిలలాడుతూ బయట తిరగడానికి భయపడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. బుధవారం సాయంత్రం ఈదురు గాలులు, చిన్న చినుకులు పడిన తరువాత వాతావరణం చల్లబడడంతో తరువాత తోటల్లో నుంచి నాలు గు ఏనుగుల గుంపు మెల్లగా బయటకు వచ్చిందని చెప్పారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు అల్లాడుతున్న ఏనుగులు పగటి పూట తోటలకే పరిమితమవున్నాయని అంటున్నారు.



తోటలో నుంచి బయటకు వస్తున్న ఏనుగులు

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ బద్నాన ప్రమీల

పాచిపెంట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ బద్నాన ప్రమీల అధ్యక్షతన, ఎంపీడీఓ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో సర్వస భ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి తీర్మానాలు చేయకుండా సమావేశాన్ని ముగించారు. సమస్యలేమైనా ఉన్నట్లయితే లిఖిత పూర్వకంగా తెలియజేస్తే, ఎన్నికల కోడ్ నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించనున్నట్లు ఎంపీపీ ప్రమీల ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

అధికలోడుతో 4 లారీల సీజ్


ఆర్‌టీఓ అధికారులు పట్టుకున్న లారీలు

బొండపల్లి: నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళ్తున్న నాలుగు గని బుగ్గితో రవాణా అవుతున్న లారీలను పట్టుకొని సీజ్ చేసినట్లు ఆర్‌టీఓ ఐశ్వర్యలక్ష్మి బుధవారం తెలిపారు. మండల కేంద్రం మీదుగా విశాఖపట్టణం నుండి గజపతినగరం వైపు హరిత రహదారి నిర్మాణం కోసం నిబంధనలకు మించి అధికంగా నాలుగు లారీల్లో బుగ్గిని తీసుకువెళ్తుండగా అందిన సమాచారం మేరకు పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు సీఐ సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు


కుక్కల కాటుకు గురైన మండల లక్ష్మి

జియ్యమ్మవలస: మండలంలోని సింగనాపురానికి చెందిన మండల లక్ష్మిపై బుధవారం ఉదయం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఉదయం లక్ష్మి కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లగా ఆ సమయంలో కుక్కల మూక ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. చికిత్స నిమిత్తం చినమేరంగి సీహెచ్‌సీకి తరలించారు. వైద్య సేవలు పొందుతున్నారు.

కళాపై రెండు కేసులు

● అఫిడవిట్‌లో పేర్కొన్న కళా

చీపురుపల్లి: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావుపై రెండు కేసులు ఉన్నాయని తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బుధవారం నామినేషన్ దాఖలు చేసిన ఆయన ఎన్నికల అధికారులకు అఫిడవిట్ సమర్పించారు. అందులో రెండు కేసులు తనపై ఉన్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాలవలస మండలంలోని ఉల్లాసపేటలో పోలీస్ ఉత్తర్వులను ధిక్కరించినందుకు ఆముదాలవలస పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. అలాగే రామతీర్థంలో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిపై హత్యాయత్నం చేసేందుకు చేసిన కుట్రలో భాగంగా నెలిమర్ల పోలీస్‌స్టేషన్‌లో తనపై కేసు నమోదై ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఫార్చ్యూనర్ కారులో తిరుగుతున్న ఆయన 2013లో కొనుగోలు చేసిన ఏపీ28 బీడబ్ల్యూ 0234 నంబర్ గల ఇన్నోవా కారు తప్ప మరే ఇతర వాహనాలు లేవని, తన భార్య పేరుతో అసలు వాహనాలే లేవని అఫిడవిట్‌లో పేర్కొనడం గమనార్హం.

వ్యక్తి ఆత్మహత్య


మృతుడు సీతారామరాజు

గంట్యాడ: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. గంట్యాడ మండల కేంద్రానికి చెందిన గుట్టుముక్కల సీతారామరాజు 15 రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తున్నాడు. పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ ఉంటే ఎలాగని భార్య శైలజ అడిగినందుకు మనస్తాపానికి గురై మంగళవారం పురుగు మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు.

మాజీ వీఆర్‌ఓకు ఆర్థిక సహాయం

తెర్లాం: అనారోగ్యంతో కొంత కాలంగా బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెరుమాళి మాజీ వీఆర్‌ఓ పాపారావుకు తోటి వీఆర్‌ఓలు, వివిధ హోదాల్లో ఉన్న రెవెన్యూ అధికారులంతా కలిసి ఆర్థిక సహాయాన్ని అందించారు. మండలంలోని పెరుమాళి గ్రామంలో ఎనిమిదేళ్లు వీఆర్‌ఓగా పని చేసి బదిలీపై మెరకముడిదాం మండలానికి వెళ్లిన పాపారావు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనను ఆదుకొనేందుకు జిల్లాలోని పలు మండలాలకు సంబంధించిన తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్‌ఓలు కలిసి రూ.లక్షా 2వేలు పోగు చేశారు. విరాళాల రూపంలో పోగు చేసిన సొమ్మును తెర్లాం మండలం రంగప్పవలస, వి.చిన్నయ్యపేట, కొరటాం వీఆర్‌ఓలు నరసింహనాయుడు, గణపతి, రాము బుధవారం ఆస్పత్రికి వెళ్లి పాపారావు కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వీఆర్‌ఓ పాపారావును ఓదార్చి ధైర్యం చెప్పారు. ఏ అవసరమైనా రెవెన్యూ అధికారులంతా తోడుగా, అండగా ఉంటామని భరోసానిచ్చారు. కష్టాల్లో ఉన్నప్పుడు తనను ఆదుకున్న తోటి వీఆర్‌ఓలు, రెవెన్యూ అధికారులకు పాపారావు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹236

రక్త పిశాచాలపై దాడి

- విస్తృతంగా దోమల నివారణ
- మన్యంలో మలేరియాకు చెక్
- ప్రభుత్వ చర్యలతో మరణ రేటు జీరో
- ఐదేళ్లలో 7,55,638 మందికి రక్తపరీక్షలు చేస్తే 975 మందికి పాజిటివ్
- నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం


ఇళ్లలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

వ్యాధి లక్షణాలు..

- మలేరియా ఉన్నవారికి ఎప్పుడూ జ్వరం ఉంటుంది. సాధారణంగా ఆ వ్యక్తికి అధిక ఉష్ణోగ్రతతో జ్వరం అకస్మాత్తుగా వచ్చి చలి కూడా ఉంటుంది.
- సాధారణంగా ఫాల్సీఫారమ్ మలేరియా తీవ్రంగా ఉంటుంది.
- తీవ్ర మలేరియా జ్వరం వచ్చిన రెండుగంటలలోగానే ఆస్పత్రిలో చేర్పించాలి.
- తలనొప్పి, వళ్లునొప్పులు, వణుకుతో కూడిన చలిజ్వరం, చెమట పట్టడం వంటి బాధతో ఉన్నారంటే తక్షణం రక్త పరీక్ష చేయించుకోవాలి.

సీతంపేట: గిరిజన గ్రామాల్లో మలేరియా తగ్గుముఖం పడుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ చర్యలేనని చెప్పవచ్చు. గడిచిన ఐదేళ్లలో పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గల గిరిజన గ్రామాల్లో మలేరియాతో మరణాలు సంభవించిన దాఖలాలు లేవు. విస్తృతంగా ఇండోర్ రీషెడ్యూల్ స్ప్రే, 5శాతం ఆల్ఫా సైపర్ మెత్రిన్ మందు ద్రావణం స్ప్రేయింగ్, దోమతెరల పంపిణీ వంటి చర్యలతో జిల్లాలో మలేరియా తగ్గుముఖం పట్టింది. ఏటా రెండు దఫాలు దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్నారు. రెండేళ్ల క్రితం 4లక్షలకు పైగా దోమతెరలను పంపిణీ చేశారు. వాటిని గ్రామాల్లో వినియోగించడంతో మలేరియా పాజిటివ్ కేసులు తగ్గుముఖం పడుతున్నాయి.


స్థానిక గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహంలో స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

వచ్చే నెల 15 నుంచి దోమల నివారణ మందు స్ప్రేయింగ్..

వచ్చే మే నెల 15 నుంచి దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హైరిస్క్ మలేరియా గ్రామాలతో పాటు వసతిగృహాలు, సంక్షేమ ఆశ్రమపాఠశాలలు, గురుకులాల్లో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ చేయనున్నారు.

నాలుగేళ్లలో ఉమ్మడి ఐటీడీఏ పరిధిలో పరిశీలిస్తే..

సంవత్సరం	సేకరించిన రక్తపూతలు	పాజిటివ్ కేసులు
2019-20	1,95,647	248
2020-21	1,78,020	224
2021-22	2,50,972	196
2022-23	93792	192
2023-24 (ఏప్రిల్)	37,207	115

ఐదేళ్లలో 7,55,638 మంది జ్వరపీడితులకు రక్తపరీక్షలు చేయగా వారిలో 975 మందికి మలేరియా పాజిటివ్ వచ్చింది. ఏటా రాను,రాను కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టింది.

దోమలతో మలేరియా..

ఎనాఫిలిస్ దోమ వల్ల మలేరియా వ్యాధి వస్తుంది.జూన్ నుంచి అక్టోబర్ మధ్య కాలంలో ఎక్కువగా దోమలు వ్యాప్తి చెందుతాయి.

● ఆడ ఎనాఫిలిస్ దోమ మలేరియా వ్యాధి క్రిములను రోగి నుంచి ఆరోగ్యవంతులకు చేరవేస్తుంది. ● వర్షాకాలం సీజన్‌లో తరచూ వచ్చేవ్యాధి మలేరియా. దీని లక్షణాలు ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలి.

● మలేరియా కారక సూక్ష్మ క్రిములు నాలుగు విధాలుగా ఉంటాయి. అవి వైవాక్స్ ప్లాస్మోడియం, ఫాల్సీ ఫారమ్, ప్లాస్మోడియం ఒవెల్, ప్లాస్మోడియం మలేరియా.

మలేరియా నియంత్రణ మనందరి బాధ్యత

● డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: మలేరియా నియంత్రణ మనందరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లా ఆరోగ్య కార్యాలయంలో మాట్లాడుతూ సమానత్వ ప్రపంచం కోసం మలేరియాపై పోరాటాన్ని ఉద్ధృతం చేయాలని, ప్రపంచ మలేరియా నివారణ దినం నినాదాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువ మేర విస్తరించి ఉన్నందున మలేరియా నియంత్రణకు మరింత కృషి చేయాలని, శాఖల సమన్వయంతో సిబ్బంది పనిచేయాలని, మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఎక్కువ దృష్టి సారించి పక్కా ప్రణాళికతో కార్యచరణ చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఫీవర్ సర్వలెన్స్ ద్వారా ఇంటింటి సర్వే చేసి జ్వర లక్షణాలతో ఉన్న వారిని గుర్తించాలన్నారు. నిర్ధారణ పరీక్షలు చేసి మలేరియా, డెంగీ జ్వరాలుగా గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి జ్వరం తగ్గే వరకూ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. దోమలు వ్యాప్తి చెందకుండా డ్రైడే కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించి, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆదేశించారు.

మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యవేక్షణ

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని, మలేరియా జ్వర నిర్ధారణకు ఆర్‌డీటీ, రక్త పూతలు(స్లైడ్స్)సేకరణ పరీక్షలు క్షేత్ర స్థాయిలో ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్నామన్నారు. మలేరియా నియంత్రణకు ముందస్తు కార్యాచరణగా వచ్చే నెల మే15 నుంచి మొదటి విడత స్ప్రేయింగ్ (దోమల నియంత్రణ పిచికారీ) జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నామని ఇందుకోసం 401 గ్రామాలు ఎంపిక చేశామని తెలిపారు.

మలేరియా రాకుండా..

- ✔ ఇంటిలోపల బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.ఇంటి వాతావరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ✔ దోమతెరలు వాడాలి. ఇంటి కిటికీలకు మెస్‌లు బిగించాలి.
- ✔ తాగిపడేసిన కొబ్బరి బొండాలు, వాడిన టైర్లు ఇంటి పరిసరాల్లో ఉంచకూడదు.
- ✔ వాటర్ ట్యాంకులకు మూతలు వేయాలి. మలాథియన్ స్ప్రేయింగ్‌ను ఇంటిలోపల, బయట చేయించుకోవాలి.

అప్రమత్తంగా ఉన్నాం



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. మలేరియా నివారణకు పీహెచ్‌సీలో మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. మలేరియా నిర్మూలన కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నాం.

విజయపార్వతి,
డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఐటీడీఏ సీతంపేట

రోజు విడిచి రోజు జ్వరం రావచ్చు

మలేరియా క్రిములున్న దోమ ఆరోగ్యవంతులకు కుట్టిన 10 నుంచి 14 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. జ్వరంతో పాటు వాంతులు కూడా అవుతుంటాయి.

26 నామినేషన్ల దాఖలు

● పార్లమెంటుకు 10, శాసనసభకు 16

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో అసెంబ్లీ, అరకు పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి బుధవారం 26 నామినేష్లు దాఖలయ్యాయి. నామినేషన్లు దాఖలు చేసిన వారి వివరాలిలా ఉన్నాయి.

పార్టీ	అభ్యర్థి పేరు
అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి..	
వైఎస్సార్‌సీపీ	డాక్టర్ గుమ్మ తనూజ రాణి (రెండు సెట్లు)
వైఎస్సార్‌సీపీ	చెట్టి వినయ్ (డమ్మీ)
సీపీఎం (ఎం)	సురేంద్ర కిల్లో
సీపీఎం (ఎం)	అప్పలనరస (డమ్మీ)
స్వతంత్ర	వెంకటరావు జొరంగి
స్వతంత్ర	నిమ్మక జయరాజు (మూడవ సెట్)
బీజేపీ	కొత్తపల్లి గీత (రెండు సెట్లు)
స్వతంత్ర	సమరెడ్డి బాలకృష్ణ
స్వతంత్ర	అశోక్ కుమార్
ఇండియన్ ప్రజా బంధు	ఊయక చెంచు
సాలూరు అసెంబ్లీకి..	
వైఎస్సార్‌సీపీ పీడిక సుదర్శనరావు	పీడిక సుదర్శనరావు (రెండవ సెట్ రాజన్నదొర తరఫున)
తెలుగు దేశం పార్టీ	గుమ్మిడి సంధ్యారాణి (మూడో సెట్)
కాంగ్రెస్ పార్టీ	మువ్వల పుష్పారావు

పార్టీ	అభ్యర్థి పేరు
కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి..	
సీపీఐ (ఎం)	బిడ్డిక శంకరరావు
సీపీఐ (ఎం)	మండంగి రమణ (డమ్మీ)
తెలుగుదేశం పార్టీ	అడ్డాకుల నరేష్
పాలకొండ నియోజకవర్గానికి..	
జనసేన	నిమ్మక జయకృష్ణ
కాంగ్రెస్	సవర చంటిబాబు
స్వతంత్ర	నిమ్మక పాండురంగ
పార్వతీపురం అసెంబ్లీకి..	
వైఎస్సార్‌సీపీ	అలజంగి జోగారావు (రెండుసెట్లు)
వైఎస్సార్‌సీపీ	అలజంగి రవి కుమార్ (డమ్మీ)
జై భారత్ నేషనల్ పార్టీ	పొట్నూరు కిరణ్ కుమార్
స్వతంత్ర	అక్కివరపు మోహన్ రావు ఒక
తెలుగుదేశం పార్టీ	బోనెల విజయ చంద్ర (రెండు సెట్లు)
స్వతంత్ర	అక్కివరపు మోహన రావు

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం

విజయనగరం టౌన్: పట్టణంలోని రింగ్‌రోడ్ టౌన్ సెంటర్ లే అవుట్‌లో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త తల్లాప్రగడ అరుణ రామాయణ అనుగ్రహభాషణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎండను తోసిరాజని..!

ప్రచార పర్వం

మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నా రు. ప్రచారంలో వెంట వస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలకు వద్దకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది.


గరుగుబిల్లి: ఆర్దీవలసలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి


వీరఘట్టం: విక్రమపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి


పార్వతీపురం టౌన్: పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

మాత, శిశు ఆరోగ్యానికి భరోసా

- ఘోషాస్పత్రిలో గర్భిణులు, శిశువులకు మెరుగైన వైద్యం
- తగ్గిన మాత, శిశు మరణాలు– ఐదేళ్లలో 30,023 ప్రసవాలు
- 10,381 మంది నవజాత శిశువులకు వైద్య సేవలు
- హైరిస్క్ గర్భిణులకు సైతం ప్రసవాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలింత పేరు బూర్లి సరస్వతి. ఈమెది సాలూరు మండలం పురోహితునివలస. వారం రోజులు క్రితం ప్రసవం కోసం ఘోషాస్పత్రిలో చేరింది. ఈమెకు వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి మూడు రోజులు క్రితం సిజేరియన్ చేశారు. ఆమెకు మగ బిడ్డ జన్మించాడు. ఒక్క పైసా ఖర్చు కాకుండా వైద్యులు ప్రసవం జరిపించడంతో ఆమె ఎంతో సంతోషిస్తుంది.


ఘోషా ఆస్పత్రి


ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న శిశువు



ఈ ఫొటోలో కనిపిస్తున్న శిశువుది పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం చెముడు గ్రామం. పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో మామిడి పల్లవి ఈ శిశువుకు జన్మనిచ్చింది. నెలలు నిండకుండా 840 గ్రాములతో శిశువు జన్మించింది. దీంతో ఆ శిశువుకు శ్వాసకోశ సమస్య రావడంతో అక్కడ వైద్యులు ఘోషాస్పత్రికి ఎస్ఎన్‌సీయూకి రిఫర్ చేశారు. ఆస్పత్రిలో చేరిన వెంటనే ఎస్ఎన్‌సీయూ వైద్యులు సీపీఏపీ మెషిన్‌పై ఉంచి చికిత్స అందించారు. శిశువుకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. దీంతో శిశువు బరువు 1.4 కేజీలకు పెరిగింది. ఆరోగ్యంగా ఉండడంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు.

విజయనగరం ఫోర్ట్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోనే అతిపెద్ద ఆస్పత్రి అయిన ఘోషాస్పత్రిలో మాత, శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. అవసరమైన అన్ని వసతులను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గర్భిణులతో పాటు నవజాత శిశువుల ఆరోగ్యానికి, ప్రాణాలకు భరోసా ఇచ్చే విధంగా ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన గర్భిణులకు ప్రసవం జరిపిస్తున్నారు. అనారోగ్యంతో నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ)లో చేరిన వారు పూర్తిగా ఆరోగ్య వంతులయ్యే వరకు చికిత్స అందిస్తున్నారు. ఘోషాస్పత్రిలో ప్రసవాలతో పాటు గైనిక్ సమస్యలతో వచ్చే మహిళలకు శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రి మాదిరి ఇక్కడ కూడా ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణుల సమస్యలను ఘోషాస్పత్రి వైద్యులు ఎంతో ఓపికగా తెలుసుకుని అవసరమైన చికిత్స అందిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. ఉత్తరాంధ్రలో మాత, శిశువులకు సేవలు అందించడంలో ఘోషాస్పత్రి పేరుగాంచింది. అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. దీంతో అధికశాతం మంది మహిళలు ఇక్కడ సేవలు పొందడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. గైనిక్‌కు సంబంధించి స్పెషలిస్టులు ఇక్కడ ఉండడంతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి నిత్యం రిఫరల్స్ వస్తున్నాయి. వీటికి కూడా ఇక్కడ సేవలు వైద్య సిబ్బంది అందిస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో చేరిన రోగులు సేవల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన గర్భిణుల ప్రసవం కోసం ఘోషాస్పత్రికి వస్తున్నారు. జిల్లాతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం, జి.సిగడాం, విశాఖపట్నం జిల్లా పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల నుంచి గర్భిణులు వస్తున్నారు. హైబీపీ, బీపీ, షుగర్ ఉన్నవారు, హెచ్ఐవీ, క్షయ, రక్తహీనత, గుండె జబ్బులు ఉన్న రోగులను హైరిస్క్ గర్భిణులుగా గుర్తిస్తారు. అటువంటి హైరిస్క్ రోగులను పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి ఘోషాస్పత్రికి రిఫర్ చేస్తారు. హైరిస్క్ గర్భిణులకు సుఖ ప్రసవం అయిన వారికి సుఖ ప్రసవం జరిపిస్తారు. సిజేరియన్ అవసరం అయిన వారికి సిజేరియన్ చేస్తారు.

2019 నుంచి 2023 వరకు ఆస్పత్రిలో జరిగిన ప్రసవాల వివరాలు

సంవత్సరం	ప్రసవాల సంఖ్య
2019	7,561
2020	6,849
2021	5,988
2022	4,991
2023	4,631

2019 నుంచి 2023 వరకు సేవలు పొందిన శిశువుల వివరాలు

సంవత్సరం	శిశువుల సంఖ్య
2019	1694
2020	1919
2021	2090
2022	2218
2023	2460

ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు

కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాదిరి ఘోషాస్పత్రిలో కూడా ఆధునాతన వైద్య పరికరాలను ఉపయోగించి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు అపోలో, కేర్ వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేస్తారు. అటువంటి ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు ఘోషాస్పత్రిలో కూడా చేస్తున్నారు. నెలకు 40 నుంచి 50 వరకు శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

ఐదేళ్లలో 30,023 ప్రసవాలు

ఘోషాస్పత్రిలో గడిచిన ఐదేళ్ల కాలంలో వేలాది మందికి ప్రసవం జరిపించారు. 2019 నుంచి ఇప్పటి వరకు 30,023 మందికి సేవలు అందించారు. అదేవిధంగా 2019 నుంచి ఇప్పటి వరకు 10,381 మంది శిశువులకు సేవలు అందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

COACHING CENTER
■ Coaching Centre 10th & Inter Fail విద్యార్థులకు 100% పాస్ గ్యారంటీ కోచింగ్ 12years Exp. Faculty ; 100% Result సాధించిన సంస్థ 9392733188, 7013212150 [S- 1235761]

FLAT FOR SALE
■ విజయనగరం పూల్‌బాగ్ స్వామి లేవుట్‌లో శ్రీశ్రీనివాస రెసిడెన్సి నందు East Facing FLAT 2100 SFT, 3BHK, UDS 84Sq.yards.1st ఫ్లోర్, 2 కార్ పార్కింగ్స్ సదుపాయంతో అమ్మకమునకు కలదు.Cont. 9492222074, 9398936707 [S- 1235966]

PLOT FOR SALE
■ ఫ్లాష్.. ఫ్లాష్.. 5,00,000/- కే విజయనగరం సిటీలో అన్ని డవలప్‌మెంట్స్‌తో ఇళ్ళ స్థలాలు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే. ✆ : 90309 64482. [V- 701]

BUSINESS OFFER
■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మిషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు. 9310515624, 8800496710 [G-1468]

ASTROLOGY
■ శ్రీ గాయత్రీ దేవి జోతిష్య పీఠం : S.V. శాస్త్రి గారు గత 20 సం॥లుగా VZM లో స్థిరపడి ఉన్నారు. మీ ప్రోటన ప్రేలు, హస్త రేఖలు జాతక చక్రం చూసి సంపూర్ణ జోతిష్యం చెప్పబడును. వివాహం, సంతానం, ఆరోగ్యం, స్త్రీ, పురుషులకు ఎటువంటి సమస్యలకైనా శాశ్వత పరిష్కారం చేయబడును. Opp. భాష్యం స్కూల్, VZM. ఫోన్ : 97017 78711 [V- 1810]

WANTED
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217 [M-1185046]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9985193111,9573633520. [M-1233969]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000 - 40,000, ఫ్రీ రూమ్+భోజనం, Hyd. Ph: 9014885406 [HA-47]

■ ప్రముఖ బ్యాంకులలో పర్మినెంట్‌గా కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ కా॥ Q: 10th - డిగ్రీ జీ॥ 28,000/– 7981652556 [H-801613]

■ ప్రముఖ ఎయిర్‌పోర్టులో పనిచేయుటకు లోడింగ్ సూ॥వైజర్స్, హౌస్ కీపింగ్ సూ॥వైజర్స్, డ్రైవర్స్, కార్గో లోడర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం: 25000/- 35000/-, రూమ్+భోజనం ఫ్రీ. ఫోన్: 9642281084 [H-788081]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [HA-51]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.